క్లుప్తంగా

శుభ్రంగా పుష్కరఘాట్లు


వ్యర్థాలను తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

బాసర: మండలకేంద్రంలోని గోదావరి తీరాన నిర్మించిన పుష్కరఘాట్లు అపరిశుభ్రంగా ఉండటంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై ఈనెల 23న సాక్షిలో అధ్వానంగా పుష్కరఘాట్లు శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆలయ ఈవో నవీన్‌కుమార్.. గురువారం పారిశుధ్య సిబ్బంది చేత పుష్కరఘాట్ల వద్ద పేరుకుపోయిన వ్యర్థాలను శుభ్రం చేయించారు.

విద్యార్థులకు బూట్లు అందజేత


బూట్లు అందిస్తున్న ఉపాధ్యాయులు

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.15వేల విలువైన బూట్లను గురువారం పలువురు ఉపాధ్యాయులు విరాళంగా అందించారు. వానల్‌పాడ్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గణపతి, మాలతికాసిరెడ్డి, మిర్జాపూర్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మల్లి కార్జున్‌రావు 63 మంది విద్యార్థులకు రూ.15 వేల విలువైన బూట్లను పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు గంగాధర్, ఉపాధ్యాయులు కె.రమేశ్ పాల్గొన్నారు.

నేటి నుంచి కొనుగోళ్లు

కుభీర్: కుభీర్ వ్యవసాయ మార్కెట్‌లో నేడు (శుక్రవారం) మధ్యాహ్నం రెండు గంటలకు కందుల కొనుగోళ్లను ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ ప్రారంభిస్తారని మార్కెట్ కార్యదర్శి గంగాధర్, పీఏసీఎస్ సీఈవో క్రాంతికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వరంగ సంస్థ మార్క్‌ఫెడ్ క్వింటాల్‌కు రూ.7,550 మద్దతు ధర అందిస్తుందని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సోన్: జిల్లాకేంద్రంలో జిల్లాస్థాయి ఆంగ్ల భాషా నైపుణ్య పోటీలు ఇటీవల నిర్వహించగా మండలంలోని కద్తాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం.చైత్ర ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. ఈసందర్భంగా చైత్రతోపాటు గైడ్ టీచర్ కె.శైలజను ఉపాధ్యాయులు సన్మానించారు.

మెరుగైన వైద్యసేవలు అందించండి


రికార్డులు పరిశీలిస్తున్న డీఐవో చందన

ఖానాపూర్: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి (డీఐవో)డాక్టర్ చందన పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో బస్తీ దవాఖానను డీఐవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా వారాంతపు టీకాల కార్యక్రమం నిర్వహణను, వ్యాక్సిన్ల నిల్వను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగుల వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సిబ్బంది ఉన్నారు.

'జంతు బలి చేయొద్దు'

సారంగాపూర్: గణతంత్ర దినోత్సవం రోజున (ఆదివారం) ఎవరూ అడెల్లి ఆలయ పరిసరాల్లో జంతుబలి చేయొద్దని ఈఓ రమేశ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయ పరిసరాల్లో జంతుబలి చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆలయానికి వచ్చే భక్తులు ఈ విషయం గమనించాలని కోరారు.

రోడ్డు భద్రతపై అవగాహన

భైంసాటౌన్: జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా పట్టణంలోని వశిష్ట జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఎస్సై మహమ్మద్ గౌస్ రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడుపవద్దని సూచించారు. వాహనదారులు అన్ని పత్రాలు వెంట ఉంచుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మూడోరోజూ గ్రామసభలు


భైంసారూరల్ : కుంబిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

భైంసారూరల్: మండలంలోని కుంబి, మిర్జాపూర్, కథ్‌గాం, తిమ్మాపూర్, వాలేగాం, మహాగాం గ్రామాల్లో గురువారం గ్రామసభలు నిర్వహించారు. ప్రజల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు ఆదిత్య గౌడ్, జావిద్‌పాషా, కార్యదర్శులు పాల్గొన్నారు.

బాసర: మండలంలోని దోడాపూర్, బిద్రెల్లి గ్రామాల్లో గురువారం గ్రామసభలు నిర్వహించారు. గ్రామస్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఎంపీడీవో అశోక్‌కుమార్ ఈనెల 26 నుంచి ప్రవేశపెట్టే సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రకటించిన జాబితాలో పేర్లు లేని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శుక్రవారం బాసరలో గ్రామ సభ నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కుంటాల: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని ఎంపీడీవో లింబాద్రి పేర్కొన్నారు. మండలంలోని వెంకూర్, మెదన్‌పూర్, లింబా(కె) గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. లింబా(కె)లో రోడ్లపై అక్రమ కట్టడాలను తొలగించాలని గ్రామస్తులు తీర్మానం చేయగా.. నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకుంటామని ఎంపీవో రహీంఖాన్ పేర్కొన్నారు. తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్, డీటీ నరేశ్‌గౌడ్, ఏవో విక్రమ్, ఏపీవో నవీన్, కార్యదర్శులు అరుణ, శ్రీనివాస్, గంగాప్రసాద్ ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని పీచర, వడ్యాల్ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించగా మండల ప్రత్యేకాధికారి అంబాజీ హాజరయ్యారు. పీచరలో ఏఈ మధుకర్, వడ్యాల్ గ్రామసభలో మండల ప్రత్యేకాధికారి అంబాజీ లబ్ధిదారుల జాబితా చదివి విన్పించారు. కొందరు తమ పేర్లు రేషన్‌కార్డుల్లో లేవని చెప్పగా.. మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపీడీవో రాధ, తహసీల్దార్ జానకి, ఎంపీవో అమీర్‌ఖాన్, ఎస్సై సుమలత, డీటీ అబ్దుల్ అజీజ్, ఏఈ మధుకర్, కార్యదర్శులు పాల్గొన్నారు.


బాసర : బిద్రెల్లిలో గ్రామసభకు హాజరైన జనం

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి, టెంబుర్ని, తిమ్మాపూర్ (జి) గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. వెటర్నరీ డాక్టర్ షేక్ ముక్తార్, ఎంపీఓ తిరుపతిరెడ్డి, డీటీ అబ్దుల్ వాహీద్, కార్యదర్శులు నరేశ్‌కుమార్, శైలజ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముథోల్: మండలకేంద్రంలో గ్రామసభ నిర్వహించిన అధికారులు.. ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. స్థానికసంస్థల ఎన్నికల్లో లబ్ధి కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామసభల పేరిట ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తోందని బీజేపీ నాయకులు కోరి పోతన్న, దేవోజీ భూమేశ్, తాటివార్ రమేశ్ ఆరోపించారు. తహసీల్దార్ శ్రీకాంత్ పాల్గొన్నారు.


లింబా(కె)లో మాట్లాడుతున్న ఎంపీవో రహీం

తానూరు: మండలంలోని బెంబరలో నిర్వహించిన గ్రామసభలో తహసీల్దార్ లింగంమూర్తి పాల్గొని మాట్లాడారు. అధికారులు పాల్గొన్నారు.

నేతాజీకి ఘన నివాళి


భైంసాలో నివాళులర్పిస్తున్న నాయకులు


సోన్ : నివాళులర్పిస్తున్న కద్తాల్ గ్రామస్తులు

భైంసాటౌన్: పట్టణంలో నేతాజీ సుభాశ్‌చంద్రబోస్ జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు.కిసాన్‌గల్లి పాతరూరల్ పోలీస్‌స్టేషన్ సమీపంలో నేతాజీ విగ్రహానికి నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో పట్టణ సీఐ గోపినాథ్, బీఆర్ఎస్ నాయకుడు విలాస్ గాదేవార్, బీజేపీ నాయకులు మల్లేశ్వర్, గాలి రవి, రావుల పోశెట్టి, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కుంటాల: మండల కేంద్రంలోని సృజన విద్యానిలయం, శాంతినికేతన్ పాఠశాలల్లో చంద్రబోస్ జయంతి నిర్వహించారు. ప్రిన్సిపాళ్లు కొత్త కాపు గంగన్న, సంతోష్, డైరెక్టర్ ప్రవీణ్ ఉన్నారు.

భైంసారూరల్: మండలంలోని చుచుంద్ ప్రాథమిక పాఠశాలలో గురువారం నేతాజీ సుభాశ్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. హెచ్ఎం సురేశ్, ఉపాధ్యాయులు గణపతి, పండరి, రాజేశ్వర్ పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని విజయ ఉన్నత పాఠశాలలో సుభాశ్ చంద్రబోస్ జయంతి నిర్వహించారు. విద్యార్థులు 'జైహింద్' ఆకారంలో కూర్చొని నినాదాలు చేశారు. పాఠశాల కరస్పాండెంట్ మంచిరాల నాగభూషణం చంద్రబోస్ గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు.

సోన్: మండలంలోని కద్తాల్‌లో సుభాశ్ చంద్రబోస్ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అశోక్, నారాయణ, దినేశ్, గంగాధర్, సాయన్న, సాగర్, ప్రశాంత్, రాజు పాల్గొన్నారు.


నిర్మల్‌లోని ఓ పాఠశాలలో జైహింద్ అక్షరాల ఆకారంలో కూర్చొన్న విద్యార్థులు

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

• ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్


క్రీడలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

కడెం: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం మండలంలోని అల్లంపల్లి గ్రామ జీయర్ గురుకులంలో సన్‌రైజర్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. మారుమూల అటవీ ప్రాంతంలోని పిల్లలు చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో చినజీయర్ స్వామి గురుకులాలను స్థాపించారన్నారు. జీయర్ గురుకులాలు క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. అల్లంపల్లి రోడ్డు తదితర సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్నారు. ఫిబ్రవరి మొదటి వారంలో నియోజవర్గంలో పీసీసీఎఫ్ చీఫ్ రాకేశ్ డోబ్రియాల్ పర్యటన ఉంటుందని.. గంగాపూర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామసభల్లో పేర్లు రాకుంటే అర్హులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెట్ చైర్మన్ ప్రభాకర్‌రావు, శాంతారామ్ స్వామీజీ, నాయకులు మల్లేశ్, సతీశ్‌రెడ్డి తదితరులున్నారు.

సమైక్య సంఘాల బలోపేతానికి కృషి


రికార్డులు పరిశీలిస్తున్న డీపీఎం రాజేశ్వర్

కుంటాల: సమైక్య సంఘాల బలోపేతానికి కృషి చేయాలని డీపీఎం రాజేశ్వర్ పేర్కొన్నారు. గురువారం కుంటాల మండల సమైక్య భవనంలో వీవోఏలతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. స్వయం సహాయ సంఘాల మహిళలకు బ్యాంకు రుణాలు అందించి.. ప్రతి నెలా వాయిదాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 2024–25లో ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు పలు లావాదేవీల రికార్డులను పరిశీలించారు. సీసీలు పెంటన్న, కవిత, యూసుఫ్, అకౌంటెంట్ శివప్రసాద్, వీవోఏలు మహేశ్, గౌతమ్, గజ్జారాం, హసీనా, మహేశ్ పాల్గొన్నారు.

'కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి'


నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

సోన్: మండలంలోని గంజాల్ టోల్ ప్లాజా కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26వేలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేశ్ గురువారం డిమాండ్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల గంజాల్‌టోల్ ప్లాజాలో ఫేర్వేస్ టోల్ అండ్ సెక్యూరిటీ సర్వీసెస్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ వారికి నూతనంగా కాంట్రాక్టు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈసందర్భంగా మేనేజర్ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ స్కిల్డ్ కార్మికులకు రూ.19,214, సెమీ స్కిల్డ్ వారికి రూ.15,964 అన్ స్కిల్డ్ కార్మికులకు రూ.13,676 చెల్లిస్తామని పేర్కొన్నట్లు వివరించారు. గత కంపెనీ వారు కార్మికులకు వేతనం రూ.24 వేల నుంచి రూ.29 వేల వరకు చెల్లించే వారని పేర్కొన్నారు. ప్రస్తుత కంపెనీ యాజమాన్యం జీతాలు తగ్గిస్తామని అంటున్నారని వాపోయారు. కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో నిర్వహించే టోల్ ప్లాజా కార్మికులకు వేతనాలు పెంచకుంటే సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. సీఐటీయూ యూనియన్ అధ్యక్షుడు రమేశ్, నవీన్, గంగాధర్, రాజేశ్వర్, శ్రావణ్, రాజ్‌కుమార్, గంగాధర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వసుధవాణి పుస్తకం ఆవిష్కరణ


పుస్తకం ఆవిష్కరిస్తున్న రామకృష్ణ, తదితరులు

భైంసాటౌన్: పట్టణంలోని గురుకృప వొకేషనల్ జూనియర్ కళాశాలలో గురువారం పుస్తకావిష్కరణ నిర్వహించారు. మండలంలోని ఇలేగాంకు చెందిన రెడ్ల బాలాజీ రచించిన వసుధవాణి పుస్తకాన్ని కళాశాల డైరెక్టర్ ముప్కం రామకృష్ణాగౌడ్, ఎన్ఆర్ఐ బాజీరావు ఆవిష్కరించారు. బాలాజీ ఇదివరకే గీతాశక్తి పుస్తకం రచించగా, ఆయన రచనకు పలువురి ప్రశంసలు, పురస్కారాలు దక్కాయి. వసుధవాణి పుస్తకం సైతం విశేష ఆదరణ పొందాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాగుల శ్రీహరి, వినాయక్, సాయినాథ్, రాజశేఖర్, కవులు తదితరులు పాల్గొన్నారు.

బోనమెత్తిన కోలూరు


బోనాలతో వెళ్తున్న భక్తులు

తానూరు: మహాలక్ష్మి ఆలయ జాతర పురస్కరించుకొని మండలంలోని కోలూరులో గురువారం బోనాల పండుగ నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. బోనాలను నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించారు. శుక్రవారం జాతర, కుస్తీ పోటీలు జరుగుతాయని గ్రామపెద్దలు తెలిపారు.

అధికారులను నిలదీసిన గ్రామస్తులు


పెంబి : మందపల్లిలో వివరణ ఇస్తున్న అధికారి


సారంగాపూర్‌లో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

సారంగపూర్: తమ పేరు అర్హులైన వారి జాబితాలో రాలేదని పలువురు గ్రామస్తులు అధికారులను నిలదీశారు. గురువారం మండలకేంద్రంలో ఎంపీఓ అబ్దుల్ అజీజ్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతుభరోసా పథకాలకు అర్హుల జాబితాను ఎంపీఓ చదివి వినిపించగానే గ్రామస్తులు అభ్యంతరం తెలిపారు. అర్హత ఉన్నా.. తమ పేర్లు జాబితాలో లేవని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. మళ్లీ దరఖాస్తులు చేసుకుంటే న్యాయం చేస్తామని అధికారులు చెప్పడంతో వారు శాంతించారు.

పెంబి: తాము అర్హులైనప్పటికీ జాబితాలో పేర్లు రాలేదని మండలకేంద్రంతోపాటు మందపల్లిలో అధికారులను ప్రజలు నిలదీశారు. గురువారం మండల కేంద్రంతోపాటు మందపల్లిలో గ్రామసభలు నిర్వహించారు. జాబితాలో పేర్లు రాని మళ్లీ అర్హులు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. ఎంపీడీవో రమాకాంత్, ఎంపీవో అనిల్‌కుమార్, కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

లోకేశ్వరం: తమకు రుణమాఫీ, గృహలక్ష్మి అమలు చేసిన తర్వాతే గ్రామసభ నిర్వహించాలని మండలంలోని రాయపూర్‌కాండ్లీ గ్రామస్తులు అధికారులను నిలదీశారు. మండలంలోని భాగాపూర్, మన్మద్, పిప్రి, పంచగుడి, సాథాగాం గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. రాయపూర్‌కాండ్లీలో గ్రామసభ నిర్వహించగా అధికారుల వద్దకు వెళ్లి గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరిస్తానని తహసీల్దార్ మోతీరాం చెప్పడంతో గ్రామస్తులు శాంతించారు. ఎంపీడీవో వెంకటరమేశ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయిప్రసాద్ ఉన్నారు.

సాకేరలో ఎఫ్ఏపై గ్రామస్తుల ఆగ్రహం

సోన్: మండలవ్యాప్తంగా మూడు రోజులుగా నిర్వహిస్తున్న గ్రామసభలు చిన్న ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిశాయి. మండలకేంద్రంతోపాటు సాకెర, గాంధీనగర్, బొప్పారం, కూచన్‌పల్లి, సంఘం పేట గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించారు. జెడ్పీ సీఈవో గోవింద్ సాకెర గ్రామసభలో మాట్లాడారు. పేర్లు రాని అర్హులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనర్హులను తక్షణం తొలగించాలని అధికారులకు సూచించారు. తాము అర్హులమైన సాకెర గ్రామంలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద నమోదు చేయలేదని ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్ మల్లేశ్, ఎంపీడీవో సురేశ్, ఎంపీఓ ఖలీల్‌హైమద్, డీటీ జ్యోతి, ఆర్ఐ రఫీక్, వ్యవసాయాధికారులు వినోద్‌కుమార్ ఉమామహేశ్వరి, ప్రగతి, రాజమల్లు, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్, ప్రియాంక, అశోక్, సంగీత, ఖాజ మొహీనుద్దీన్, ఎస్సై గోపి తదితరులు పాల్గొన్నారు.


సోన్ : గ్రామసభలో పాల్గొన్న జెడ్పీ సీఈఓ గోవింద్, అధికారులు


లోకేశ్వరం మండలం రాయపూర్‌కాండ్లీలో అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

ఖానాపూర్: పట్టణంలోని పలు వార్డుల్లో, గ్రామాల్లో సభలు నిర్వహించి లబ్ధిదారుల వివరాలను చదివి విన్పించారు. ఆయా చోట్ల పలువురు దరఖాస్తులు అందజేశారు. మండలంలోని గోసంపల్లె గ్రామసభలో ప్రజలు అధికారులను నిలదీశారు. గతంలో ప్రజాపాలన గ్రామసభల్లో ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేశామని.. మళ్లీ దరఖాస్తుల స్వీకరణకే ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని అధికారులను నిలదీశారు. రేషన్ కార్డులు మాత్రం ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నిర్మల్‌టౌన్: జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ డిపోలో గురువారం డిగ్రీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి మాట్లాడుతూ బైక్‌పై వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనం నడుపవద్దని సూచించారు. కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, ఆర్టీసీ కంట్రోలర్లు రాజేందర్, రాజన్న, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

కుంటాల: ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరుతూ మండలంలోని కల్లూరు వాసవి కళాశాల విద్యార్థులు గురువారం శాంతియుత నిరసన ర్యాలీ చేపట్టారు. మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ సెక్రెటరీ బి.సాయిలు, ప్రిన్సిపాల్ గట్టుపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కుభీర్‌లో గ్రామసభ బహిష్కరణ


గ్రామసభలో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

కుభీర్: మండలకేంద్రమైన కుభీర్ మేజర్ గ్రామపంచాయతీలో గురువారం గ్రామసభ బహిష్కరించారు. అధికారులు నాలుగు పథకాలకు లబ్ధిదారుల పేర్లు చదువుతుండగా గ్రామస్తులు ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామసభలో కనీసం కూర్చొనేందుకు కుర్చీలు ఏర్పాటు చేయలేదన్నారు. ఈవో బదిలీ ఏ విధంగా చేశారు. రిలీవ్ కాకుండా ఎందుకు విడుదల చేశారని అధికారులను నిలదీశారు. మురుగుకాల్వలు పూడికతో నిండిపోయాయని.. ఎనిమిది వేల జనాభా కలిగిన మేజర్ గ్రామ పంచాయతీకి 23 రోజులుగా ఈవో లేకపోవడం ఏంటని ప్రశ్నించారు. వెంటనే అధికారులు డీపీవో శ్రీనివాస్‌తో మాట్లాడారు. శుక్రవారం కొత్త ఈవోను పంపిస్తానని హామీ ఇచ్చారు. ఈవో వచ్చేవరకు గ్రామసభ నిర్వహించేది లేదని తేల్చిచెప్పారు. భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావ్ పటేల్ నచ్చజెప్పేందుకు యత్నించినా గ్రామస్తులు వినకపోవడంతో శుక్రవారానికి వాయిదా వేశారు. ఎంపీడీవో నవనీత్‌కుమార్, ఎంపీవో మోహన్‌సింగ్, తహసీల్దార్ అశోక్‌కుమార్, ఎస్సై పి.రవీందర్, మండల మాజీ అధ్యక్షులు సావుల మల్లన్న, వివిధ పార్టీల నాయకులు బంకజ బాబు, పి.గంగాధర్, గంగాశేఖర్, ఎ.దత్తాత్రి, కనుకయ్య, వెంకటస్వామి, జి.సంతోష్ తదితరులు ఉన్నారు.

సభకు తరలిన నాయకులు

కుంటాల: ఎస్సీ వర్గీకరణ అమలుకు హైదరాబాద్‌లో ఈనెల 27న వెయ్యి గొంతుకలు–లక్ష డప్పుల సభ నిర్వహించనున్నారు. ఈ సభ సన్నాహక సమావేశం గురువారం నిర్మల్‌లో నిర్వహించగా మందకృష్ణ మాదిగ హాజరయ్యారు. దీనికి నియోజకవర్గ నుంచి నేతలు తరలి వెళ్లారు. సాయినాథ్, అన్నేవార్ గజేందర్, వన్నెల సతీశ్, విఠల్ పాల్గొన్నారు.

బాబా ఆలయంలో పూజలు

కుంటాల: మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి కనిపించింది. మహిళలు పలు గ్రామాల నుంచి పాదయాత్రగా ఆలయానికి వచ్చారు. బాబాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం అన్నదాతను ఘనంగా సన్మానించారు.

అర్హులకు 'డబుల్' ఇళ్లు ఇవ్వాలి


నిరసన తెలుపుతున్న ఆదివాసీలు

నిర్మల్‌టౌన్: అర్హులైన ఆదివాసీ కుటుంబాలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు అందించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తొడసం శంభు అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట వైఎస్సార్ కాలనీ ఆదివాసీ గూడలో అర్హులైన గిరిజనులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు, రేషన్‌కార్డులు అందించాలని నిరసన వ్యక్తం చేశారు. అర్హులుగా ఉన్నప్పటికీ జాబితాలో తమ పేర్లు రాలేదని.. మా సమస్యకు ప్రభుత్వం పరిష్కారం చూపాలని వేడుకున్నారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన నాయకులు ఆనంద్‌రావు, సోయం సూర్యభన్, భీమ్ రావు తదితరులు పాల్గొన్నారు.